క్లుప్తంగా

పార్టీ బలోపేతమే లక్ష్యం

ఖమ్మం మామిళ్లగూడెం: పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనసేన పార్టీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మిరియాల రామకృష్ణ కోరారు. బుధవారం ఎంబీ గార్డెన్స్‌లో జరిగిన ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మండలంలో కమిటీలు, జెండాదిమ్మెలు నిర్మాణం చేయాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు రామకృష్ణ, హరిప్రియ, సైదులు, పవన్, కార్తీక్, దేవేందర్, మాలిక్, ఉత్తమ్‌రాజు, సత్యనారాయణ, శ్రీకాంత్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి

ఖమ్మంమయూరిసెంటర్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. పౌర సరఫరాల శాఖలో పనిచేసే రేషన్ డీలర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిధ రూపాల్లో ఆందోళన చేపడుతున్నారని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. రేషన్ డీలర్ల ఆందోళనకు కమ్యూనిస్టు పార్టీ పూర్తి మద్దతునిస్తుందని ఆయన చెప్పారు. కాగా మరో ప్రకటనలో సీపీఐ నాయకుడు ఈర్ల నర్సింహా మృతి పట్ల పోటు ప్రసాద్ సంతాపం ప్రకటించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కామేపల్లి (కారేపల్లి): కామేపల్లి మండల పరిధిలోని కొత్తలింగాల గ్రామానికి చెందిన 25 కుటుంబాలు టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లో బుధవారం చేరారు. లింగనబోయిన చందు ఆధ్వర్యాన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు సమక్షంలో వారికి పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పండగ నాగేంద్రబాబు, నరేష్, శ్రీను, కొత్తగట్టు శ్రీకాంత్, దైదా పూజిత్, కొరివి కోటి, గంపల శ్రావణ్‌కుమార్, జక్క నరేష్, ధరావత్ రాకేష్, టి.గోపి తదితరులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి అభినందనలు

ఖమ్మం సహకారనగర్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ రెండోసారి నియామకం కావటంతో పార్టీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు యర్ర బాల గంగాధర్‌తిలక్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంస్థ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నేడు(గురువారం) హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి కోరారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభలో సీఎం కేసీఆర్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చి.. ఐదు నెలలు అవుతున్నప్పటికీ నేటి వరకు ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు రామయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సభ్యులు శివారెడ్డి, రవికుమార్, ఈ.,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

ఖమ్మంలీగల్: నగరంలోని రాపర్తినగర్ జర్నలిస్టుకాలనీకి చెందిన సీనియర్ సిటిజన్ దుస్సా భాగ్యమ్మకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలంలో ఇల్లు నిర్మించుకొని నివశిస్తున్నారు. కుమారుడు, కుమార్తె తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె ఖమ్మం ఆర్డీఓ కోర్టులో వయోవృద్ధుల రక్షణ చట్టం కింద కేసు దాఖలు చేసింది. ఈ విషయంలో ఆర్డీఓ జోక్యం చేసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. దీనిపై కలెక్టర్ కోర్టులో అప్పీలు చేయగా కలెక్టర్ విచారించారు. ప్రతివాదులైన భాగ్యమ్మ కుమార్తె అరుణ, కుమారుడు కృష్ణను ఆ ఇంటి నుంచి మూడు నెలల్లో ఖాళీ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే కుమారుడు కృష్ణ ఇల్లు ఖాళీ చేయగా కుమార్తె ఇంకా ఖాళీ చేయలేదని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతోందని భాగ్యమ్మ తరపు న్యాయవాది కోటేశ్వరరావు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	విరూపాక్ష
సాయిరాం	ఫాస్ట్ ఎక్స్
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	అన్ని మంచి శకునములే, ది కేరళ స్టోరీ
సుందర్	ది కేరళ స్టోరీ

- ఖమ్మంవ్యవసాయం

పత్తి రైతుల పరేషాన్..!

గిట్టుబాటు ధర లేక ఇళ్ల వద్దనే నిల్వలు..

- నెలల తరబడి కాపాడుకోలేక అవస్థలు
- వేసవిలో వెంటాడుతున్న అగ్నిప్రమాదాల భయం
- ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని వేడుకోలు



ముజ్జుగూడెంలో వెంకటేశ్వర్లు నివాసంలో ఉన్న పత్తి బస్తాలు

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలో ఇళ్లల్లో పత్తి నిల్వలు చేసుకున్న రైతుల్లో చాలా మంది ఆందోళనకు గురవుతున్నారు. ఓ వైపు ధర లేకపోవడం.. మరోవైపు వేసవిలో పొంచి ఉన్న అగ్ని ప్రమాదాలు వెరసి రైతులను కంటిపై కునుకులేకుండా చేస్తున్నాయి. 2021 వానాకాలం సీజన్‌లో వేసిన పత్తికి గిరాకీ ఉండడంతో గతేడాది పత్తిని పాలేరు రైతులు ఎక్కువగా వేశారు. కాగా, సీజన్‌లో పత్తితీత ప్రారంభం కావడంతో వెంటనే ధర పడిపోయింది. దీంతో రైతులు చేసేది ఏమిలేక దళారుల ధరకు విక్రయించుకోలేక.. రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. డివిజన్ వ్యాప్తంగా పత్తి నిల్వలు మూలుగుతున్నాయి.



ఈ ఫొటో కనిపిస్తున్న రైతు పేరు ఉండమోదుగుల వెంకటేశ్వర్లు. ఇతడు నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంకు చెందినవాడు. కాగా ఇతను తనకున్న 10 ఎకరాల్లో దాదాపు రూ.4.50 లక్షలు పెట్టుబడులు పెట్టి పత్తి పంట సాగు చేశాడు. తీరా ఎకరానికి 15 నుంచి 20 క్వింటాలు దిగుబడి రావాల్సి ఉండగా.. అధిక వర్షాలు, తెగుళ్ల బెడదతో ఎకరానికి 6 నుంచి 7 క్వింటాల దిగుబడి మాత్రమే వచ్చి తీవ్రంగా నష్టపోయాడు.

తెగుళ్లతో తగ్గిన దిగుబడులు..

పాలేరు నియోజకవర్గంలో నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో పత్తిని సాగు చేశారు. కాగా సీజన్ ఆరంభం నుంచి పత్తి పంటకు తెగుళ్లు ఆశించాయి. దీంతో ఖర్చులు భారీగా పెరిగాయి కానీ దిగుబడి మాత్రం బాగా తగ్గింది. క్వింటాకు కనీసం రూ. 10 వేల దిగుబడి వస్తేనే రైతు గట్టెక్కే పరిస్థితి ఉండగా.. ప్రస్తుతం దళారులు క్వింటాను రూ.7 వేల వరకు మాత్రమే విక్రయిస్తుండడంతో రైతులు విక్రయించేందుకు వెనకడుగు వేస్తున్నారు. గత ఏడు నెలల నుంచి ఇళ్లలోనే పత్తి నిల్వలు ఉన్నాయి.

పొంచి ఉన్న అగ్ని ప్రమాదాలు..

ప్రస్తుతం ఎండ తీవ్రత పెరగడంతో ఇళ్లలో తరుచూ విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. లక్షల క్వింటాల పత్తి ఇళ్లలో నిల్వలు ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని దాదాపు 45 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పత్తి విక్రయాల కోసం రోజు రోజుకు ధర పెరుగుతుందోమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పాలేరులో గతంలో పలుచోట్ల అగ్ని ప్రమాదాల వలన పత్తి దగ్ధమైన ఘటనలు అనేకం ఉన్నాయి. అంతే కాకుండా ఇంట్లో పత్తి నిల్వలతో చర్మ వ్యాధులు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మద్దతు ధర అందించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భయంగా ఉంటుంది..



మూడెకరాల్లో పండించిన పత్తి ఇంట్లోనే నిల్వ ఉంచాను. కానీ వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. ప్రభుత్వం మద్దతు ధర అందిస్తే వెంటనే విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నా.

– నున్నా మధుసూదన్, రైతు, అనాసాగారం

ఇంకెన్నాళ్లు కాపాడుకోవాలి..



గత ఏడు నెలలుగా పత్తి పంటను కాపాడుకుంటున్నాను. ఈ ఏడు పెట్టుబడి పెరిగి.. దిగుబడి తగ్గింది. వచ్చిన కొద్దిపాటి పత్తిని కూడా అమ్మలేని పరిస్థితి. ఇంకెన్నాళ్లు కాపాడుకోవాలో అర్థం కావడం లేదు. పత్తి రైతును పట్టించుకునే వారే కరువయ్యారు.

– పుల్లారావు, రైతు, అనాసాగారం

గవర్నర్‌కు వినతుల వెల్లువ



వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంసహకారనగర్/ఖమ్మంరూరల్: జిల్లాకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందర రాజన్‌ను జిల్లా అధికార యంత్రాంగం, రెడ్‌క్రాస్ బాధ్యులు, బీజేపీ నాయకులు నగరంలోని ఎన్నెస్పీ గెస్ట్ హౌస్‌లో వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి వినతిపత్రాలు సమర్పించారు. అలాగే శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్‌లో గల కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన వై20 సదస్సుకు గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా ఆర్యవైశ్యుల నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా నూతన కమిటీ వారు సొసైటీ శాఖ కార్యకలాపాలను ఆమెకు వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ వి.చంద్రమోహన్, వైస్‌చైర్మన్ ఆర్.రవీందర్‌రావు, కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, ట్రెజరర్ ఏ.గోవర్ధన్‌రావు, సాధినేని జనార్దన్‌రావు, ఎం.శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో కోతలు విధిస్తున్నారని, ఇసుక అక్రమ రవాణా సాగుతుందని, డీసీసీబీలో అక్రమాలకు పాల్పడిన వారు, డబుల్ బెడ్‌రూం పేరుతో రూ.కోట్లు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇలా పలు అంశాలను వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కెలపల్లి నరేంద్రరావు, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్, నాయకులు ప్రదీప్, రవికుమార్, మందా సరస్వతి, విజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గవర్నర్‌ను కలిసిన ఖమ్మం న్యాయవాద పరిషత్ న్యాయవాదులు మాట్లాడుతూ.. న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని ఆమోదించాలని, డెత్ బెనిఫిట్స్‌ను రూ.15 లక్షలు, ఇళ్ల స్థలాలు, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.ఐదు వేల స్టైఫండ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకట్ గుప్తా, నేరెళ్ల శ్రీనివాసరావు, పసుమర్తి లలిత, మందా సురేష్, యుగేందర్, జి.వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. అంతేకాక రాష్ట్రంలో ఆర్యవైశ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంస్థల సమాఖ్య ఉపాధ్యక్షులు వెంపటి రంగారావు, ఇతర నాయకులు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సంఘం నాయకులు సన్నె అనిల్‌కుమార్, కొంకిమెళ్ల మృత్యుంజయరావు, డోకుపర్తి రవీంద్రకుమార్, పసుమర్తి సతీష్, రాయపూడి సాయిబాబా, బి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు పుస్తకం అందజేత..

నేలకొండపల్లి: నేలకొండపల్లికి విచ్చేసిన గవర్నర్‌కు స్థానిక సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ దక్షిణ భారత దేశంలో కెల్లా అతి పెద్దదైన బౌద్ధక్షేత్రం, రామదాసు జన్మస్థలంలోని ధ్యాన మందిరం చరిత్ర విశేషాల గురించి ముద్రించిన పుస్తకాలను అందించారు.

మానవత్వం చాటుకున్న వన్‌టౌన్ సీఐ..

ఖమ్మంక్రైం: గవర్నర్ పర్యటనలో భాగంగా ఖానాపురం సమీపంలోని ఎన్నెస్పీ గెస్ట్ హౌస్ వద్ద సీఐ స్వామి బందోబస్తు విధుల్లో ఉండగా.. ఓ బొలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో గాయాలైన ద్విచక్ర వాహనదారుడిని ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

వలంటీర్లకు అభినందన..



విద్యార్థినిని అభినందిస్తున్న గవర్నర్

ఖమ్మం స్పోర్ట్స్/ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందర రాజన్ నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను అభినందించారు. బుధవారం ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌లో కలిసిన ఆమెను ఇటీవల రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్‌లో ప్రథమస్థానం దక్కించుకున్న ఎస్‌కే. జాస్మిన్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమస్థానం కైవసం చేసుకున్న భూక్య అంజలీలను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎన్.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సంస్థల చైర్మన్ చంద్రమోహన్, గోవర్ధన్, మజీద్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

‘మతోన్మాద రాజకీయాలకు కాలం చెల్లినట్లే’



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ఖమ్మంరూరల్: మతాన్ని అడ్డుపెట్టుకొని లబ్ధిపొందాలని బీజేపీ ప్రయత్నిస్తుందని, కర్ణాటక ఫలితాలతో మతోన్మాద రాజకీయాలకు కాలం చెల్లినట్లు ఆ పార్టీ గ్రహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలంలో పలు గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పోడు సమస్యకు తక్షణం పరిష్కారం చూపాలని, డీలర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 4న కొత్తగూడెం పట్టణంలో చారిత్రాత్మక సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానాతో పాటు అజ్మీర రామ్మూర్తి, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, లలయ్య, పుచ్చకాయల సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలే మార్గమని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మహ్మద్ సలాం అధ్యక్షతన నిర్వహించిన పార్టీ నగర సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణాల్లో నివసిస్తున్న పేదలందరికీ నివాస స్థలాలు పంపిణీ చేయాలని, డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నియోజక వర్గ కార్యదర్శి ఎస్‌కే జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ, ఏఐటీయూసీ అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, నాయకులు యానాలి సాంబశివారెడ్డి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని డిపో రోడ్డులో సీపీఐ నాయకులు 137వ మేడే ఉత్సవాల్లో భాగంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమైక్య పట్టణ కార్యదర్శి డి.శేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాం, నగర హహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, నాయకులు ఎస్‌కే చానా, గోడ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులా ?

ఖమ్మంసహకారనగర్: పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లి తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు జారీ చేయడాన్ని తాము తీవ్రంగా ఆక్షేపిస్తున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోతుకూరి మధు, రంగారావు, యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండ తీవ్రతను పట్టించుకోకుండా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా విద్యాధికారి జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. విధులకు హాజరైన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేస్తామని విద్యాశాఖాధికారి రాత పూర్వకంగా ఉత్తర్వులు ఇస్తేనే పాఠాలు బోధించాలని యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ ఉపాధ్యాయులకు సూచించింది. యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు పారుపల్లి నాగేశ్వరరావు, ఎస్.విజయ్, యాదగిరి, రామకృష్ణ, బన్సీలాల్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దు



కోయచలక గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీఓ శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి/రఘునాథపాలెం: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పారిశుద్ధ్య వారోత్సవాలలో భాగంగా బుధవారం నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీఓలు కె.జమలారెడ్డి, రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈమేరకు నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయం, రఘునాథపాలెంలోని కోయచలక గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య వారోత్సవాలపై ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో షెడ్యూల్‌ను కచ్చితంగా అమలు చేయాలని, కార్యక్రమంపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. వారం రోజుల పాటు కార్యక్రమాలపై గ్రామ స్థాయిలో అధికారులతో సమీక్షలు నిర్వహించుకుని కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, కోయచలకలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మాదంశెట్టి హరిప్రసాద్ ప్రారంభించారు. నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, ఈజీఎస్ ఏపీఓ సునీత, సర్పంచ్‌లు దండా పుల్లయ్య, వంగూరి వెంకటేశ్వర్లు, గురవమ్మ, వెంకటేశ్వర్లు, కార్యదర్శులు బైరం దినేష్, దేవేందర్, బోళ్ల వీరబాబు, శ్రీనివాసరావు, మహేష్, కోటేశ్వరరావు, సత్యనారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కోయచలకలో జరిగిన కార్యక్రమంలో ఉషారాణి, సాయిరాం, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, కార్యదర్శి శృతి, తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ ప్రారంభం

తిరుమలాయపాలెం: మండలంలోని చంద్రు తండా గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, గ్రామ సర్పంచ్ బోడ మంచానాయక్, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపసర్పంచ్ మహేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్లు



మేయర్‌కు మొక్క అందజేస్తున్న కమిషనర్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్మాణాలను నిర్మల్, ఖానాపూర్, బైంసా మున్సిపాలిటీల కమిషనర్లు రాజు, టి.మనోహర్, వెంకటేశ్వరరావులు బుధవారం పరిశీలించారు. తొలుత కేఎంసీలో మేయర్ పునుకొల్లు నీరజను వారు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణం, కౌన్సిల్ సమావేశ మందిరాన్ని సందర్శించారు. అనంతరం నగరంలోని గోళ్లపాడు చానల్ ఆధునీకరణ, పార్కుల నిర్మాణం, లకారం ట్యాంక్‌బండ్, నగరంలో నిర్మించిన రోడ్లు, డివైడర్లు, ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్‌వెజ్ మార్కెట్, స్ట్రీట్ వెండర్ మార్కెట్లను సందర్శించి, అభివృద్ధి కార్యక్రమాల గురించి కేఎంసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ఈఈ కృష్ణాలాల్, బైంసా డీఈ నాగేశ్వరరావు, బైంసా ఏఎంసీ యాకుబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రపంచ రక్త పోటు దినోత్సవం సందర్భంగా బుధవారం కొత్త బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులకు రక్తపోటుపై డాక్టర్ గిరిసింహారావు అవగాహన కల్పించారు. అనంతరం దీనికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డీఎం శ్రీనివాస్, సీఐ రామయ్య, ఎస్ఎం రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

సుర్దేపల్లి రచయితకు అవార్డు



అవార్డు అందుకుంటున్న రామకోటేశ్వరరావు

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లి గ్రామానికి చెందిన దూత రామకోటేశ్వరరావు అనే రచయితకు అరుదైన గుర్తింపు లభించింది. అతి తక్కువ కాలంలో మొత్తం 950 కథలు, నాలుగు సీరియళ్లు, 100కు పైగా కవితలు రాసినందుకు ఇన్‌ఫ్లూన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అవార్డును సొంతం చేసుకున్నారు.

కూలి రేట్లపై పునఃసమీక్షించుకోవాలి



మాట్లాడుతున్న క్రెడాయ్ బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: కార్మిక సంఘాల ఆధిపత్యంతో సుతారీ మేస్త్రి, కూలీల రేట్లను ఒక్కసారే రూ.200ల వరకు పెంచడం దారుణమని, పెంచిన కూలి రేట్లపై కార్మికసంఘాలు పునఃసమీక్షించుకోవాలని క్రెడాయ్ ప్రతినిధులు కొప్పు నరేష్, వేజెళ్ల సురేష్, బండి జయకిషోర్‌లు కోరారు. బుధవారం నగరంలో క్రెడాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏడాదికి రూ.50 చొప్పున రెండేళ్లకోసారి రూ.100లు పెంచాల్సి ఉండగా.. ఈ ఏడాది ఎవరితో సమీక్షించకుండానే ఏకపక్షంగా రేట్లను పెంచారన్నారు. బిల్డర్స్ అసోసియేషన్, క్రెడాయ్ పెంచిన రేట్లను నిరసిస్తూ నిర్మాణాలను బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలను చేపట్టిన యజమానులు, బిల్డర్స్, ఇతర రంగాల వారు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పెద్ది కేశవరావు, బిక్కసాని జశ్వంత్, బిల్డర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షులు టీకే మోహన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం నగరంలో పర్యటించి నిర్మాణాలను వాయిదా వేసుకోవాలని కోరుతూ భవన నిర్మాణాలను నిలిపివేయించారు. క్రెడాయ్, బిల్డర్స్ అసోసియేషన్ ఇచ్చిన భవన నిర్మాణాల బందు పిలుపుకు సహకరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు తుంపాల కృష్ణమోహన్, దోసపాటి ప్రవీణ్, క్రెడాయ్ బాధ్యులు కొప్పు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం



ఉద్యోగులకు సభ్యత్వం అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంసహకారనగర్: టీఎస్టీఓ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.అఫ్జల్ హసన్,ఆర్.వీ.ఎస్.సాగర్ ఆధ్వర్యంలో ఐడీఓసీలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రారంభించారు. ప్రతి ప్రాథమిక సభ్యులు విధిగా సభ్యత్వం తీసుకోవాలని అఫ్జల్ హసన్ కోరారు. అలాగే విద్యాశాఖలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పోస్టులను కేంద్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి.. మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను, రాష్ట్ర కార్యదర్శి జీ.ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ చుంచు వీరనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ. మజీద్, వైస్ ప్రెసిడెంట్ కిరణ్, బుద్దా భాస్కర్‌లతో పాటు షేక్.నాగుల్ మీరా, కట్టా నవీన్, సాయి శిరిణ్మయి, శాబాసు జ్యోతి, మల్లీశ్వరీ, ఎండీ.యాసుఫ్ అహ్మద్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ ఫోరమ్ నూతన అధ్యక్షుడిగా యూసుఫ్ అహ్మద్..

గతంలో డీఈఓ ఫోరం అధ్యక్షుడిగా పనిచేసిన జీ.ఎస్.ప్రసాద్‌రావు రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక కావడంతో ఖాళీగా ఉన్న ఈ పదవిని భర్తీ చేస్తూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.అఫ్జల్ హసన్, ఆర్‌వీఎస్.సాగర్ నిర్ణయం తీసుకుని ఎండీ.యూసుఫ్ అహ్మద్‌ను ఏకగ్రీవంగా నియమించారు. అనంతరం యూసుఫ్ అహ్మద్‌ను ఉద్యోగులు సన్మానించారు.

ముగిసిన ‘సీఎం కప్’ పోటీలు



నేలకొండపల్లి: విజేతలకు బహుమతులు అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ధనలక్ష్మి



తిరుమలాయపాలెం: బహుమతులు అందిస్తున్న ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: మూడు రోజుల పాటు మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. మండల స్థాయి పోటీల్లో విజేతలైన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నేలకొండపల్లిలో విజేతలకు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ రమ్య, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ దారా ప్రసాద్‌లు బహుమతులు అందజేయగా.. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన క్రీడల్లో విజేతలకు ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. నేలకొండపల్లి కార్యక్రమాల్లో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఐకేపీ ఏపీయం అశోక్‌రాణి, తదితరులు పాల్గొనగా.. పిండిప్రోలు కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీఓ జయరాం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితలరులు న్నారు.